అమర వీరులను స్మరించుకుందాం: ఎస్పీ


సన్‌ప్రీత్ సింగ్, ఎస్పీ, సూర్యాపేట

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సమాజ రక్షణలో అమరులైన పోలీసులను స్మరించుకుంటూ ఈనెల 21 నుంచి పది రోజులపాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు ఫ్లాగ్‌డే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు విధులు, టెక్నాలజీ ఉపయోగంపై పోలీసు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తామని, అత్యవసర సమయంలో బాధితులకు అందించడానికి రక్తదాన శిబిరం, అమరవీరుల కుటుంబాల సందర్శన, పోలీసు అమర వీరులను స్మరిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ, సైకిల్ ర్యాలీ తోపాటు పోలీసుల ప్రతిభ తెలిపే లఘు చిత్రాల పోటీలు, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సినిమా థియేటర్లలో పోలీసు చరిత్ర తెలిపే చిత్రాల ప్రదర్శన ఉంటుందని, తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి విభాగంలో 12వ తరగతి విద్యార్థులకు 'విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడకం' అనే అంశంపై, రెండో విభాగంలో డిగ్రీ ఆపై విద్యార్థులకు 'తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ మూడు వ్యాసాలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

★ లఘు చిత్రాల పోటీలు.. పోలీసు త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభ తెలిపే విధంగా మూడు నిమిషాల నిడివి గల లఘు చిత్రాలు(షార్ట్ ఫిల్మ్స్), పత్రికల్లో ఇటీవల ప్రచురితమైన చిత్రాలు, వ్యాసాలపై పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు లఘు చిత్రాలను, పోలీసుల ప్రతిభ తెలిపే ఇటీవలి చిత్రాలు, పత్రికల్లో ప్రచురితమైన కథనాలను జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీసు, ప్రజా సంబంధాల అధికారికి ఈ నెల 27వ తేదీలోగా అందించాలని కోరారు. పూర్తి వివరాలకు 70139 23377 నంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కళా ఉత్సవ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట సాంస్కృతికం: కళా ఉత్సవ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ జనార్దన్, జిల్లా సైన్స్ అధికారి దేవరాజు అన్నారు. జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు సూర్యాపేట జిల్లా బాలభవన్‌లో బుధవారం నిర్వహించారు. ఉత్సవాల్లో మొదటిరోజు వివిధ విభాగాల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండోరోజు ఉత్సవాలు కొనసాగుతున్నందున విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు.

శివారు.. ముందుకు రారు..!



ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాంతం కోదాడ పురపాలక పరిధిలోనిది. దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడంతో పుర అధికారులే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది.


కోదాడలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల ప్లాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కోదాడ, న్యూస్‌టుడే: ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ పథకాన్ని గత ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టింది. చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు.. మొదట్లో అవి పరిష్కరించేందుకు జాప్యం జరిగింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. మూడు నెలల్లో పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించింది. కానీ క్షేత్రస్థాయిలో ప్లాట్ల యజమానులు తమ దరఖాస్తు పరిష్కారానికి ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

20 శాతమే పూర్తి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురపాలికల్లో సుమారు రెండు లక్షల వరకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 20 శాతంలోపే పరిష్కారమయ్యాయి. చాలా మంది ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం.. పట్టణానికి దూరంగా ఉండటం, శివారు ప్రాంతాల్లో అభివృద్ధి లేకపోవడం, ఇప్పట్లో ఇంటి నిర్మాణాలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడమే.

★ ఖాళీ స్థలానికి ప్రాంతాల వారీగా ప్రస్తుత మార్కెట్ ప్రకారం రూ.4 వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజు చెల్లించాల్సి వస్తుంది. చాలా మంది కొన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. ధర తగ్గటం, ఇపుడు ఇళ్లు నిర్మించినా ప్రయోజనం లేదని భావించి ఫీజు చెల్లించడం అదనపు ఆర్థిక భారం అవుతుందని క్రమబద్ధీకరణకు ముందుకు రావడం లేదు. పట్టణం నడిబొడ్డున, ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల యజమానులు మాత్రమే ముందుకు వస్తున్నారు.

పురపాలికల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు..

పురపాలిక	దరఖాస్తులు	పరిష్కారం	పెండింగ్
నల్గొండ	36,116	7,153	21,789
కోదాడ	16,748	3,172	13,576
మిర్యాలగూడ	14,334	6,097	8,237
సూర్యాపేట	35,631	12,392	23,239
హుజూర్‌నగర్	4,414	112	4,300
నేరేడుచర్ల	3,131	127	2,520
తిరుమలగిరి	6,018	1,123	4,880
దేవరకొండ	5,022	242	3,224
నకిరేకల్	6,941	75	5,937
చిట్యాల	3,208	66	2,876
చండూరు	3,619	296	2,831
హాలియా	3,418	135	3,281

అవగాహన కల్పిస్తున్నాం:

– రమాదేవి, పుర కమిషనర్, కోదాడ

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి. చాలా మంది ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వారికి ఫోన్లు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పుడు క్రమబద్ధీకరణ చేసుకుంటే నిర్మాణాలు చేపట్టే సమయంలో ఇబ్బందులు తలెత్తవు. గడువు ముగియక ముందే దరఖాస్తుదారులు ముందుకు రావాలి.

సర్కారు బడిలో.. యువ స్వరం


మేళ్లచెరువు మండలంలో విధుల్లో చేరికకు ఎంఈవో నుంచి అనుమతులు తీసుకుంటున్న కొత్త ఉపాధ్యాయులు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: సర్కారు బడులకు కొత్తగా యువ ఉపాధ్యాయులొచ్చేశారు. అన్ని అనుమతులతో బుధవారం ఉదయమే విధుల్లో చేరారు. విద్యార్థులకు కొత్త ముఖాలతో కన్పించి కొంగొత్త యువ స్వరం విన్పించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులో చేరి.. తరగతి గదుల్లో అడుగిడిన ఆనందంలో తొలిసారి పాఠాలు బోధించి వారి అనుభూతుల్ని సీనియరు ఉపాధ్యాయులు, విద్యార్థులతో పంచుకున్నారు.

☛ సూర్యాపేట జిల్లాలో మొత్తం 322 ఖాళీ పోస్టులుండగా.. ఈసారి చింతలపాలెం, పాలకవీడు, మఠంపల్లి, నాగారం వంటి మారుమూల మండలాల్లోనే ఎక్కువ మందికి పోస్టింగ్‌లిచ్చారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో (సాంఘిక శాస్త్రం) గరిష్ఠంగా 26 మంది చేరారు. బయోలాజికల్ సైన్స్ 15, తెలుగు 12, ఆంగ్లం 12, గణితం 09, హిందీ 05, ఫిజికల్ సైన్స్ 02, పీడీ 01 మొత్తం 82 మంది వీరిలో ఉన్నారు. తెలుగు పండిట్ 11, హిందీ పండిట్ 08, పీఈటీ ఐదుగురు విధుల్లో చేరారు. మారుమూల మండలమైన ఒక్క చింతలపాలెంలోనే 19 ఎస్జీటీ, 8 స్కూల్ అసిస్టెంట్లు, రెండు పండిట్ పోస్టులను భర్తీ చేశారు. పాలకవీడు, మఠంపల్లి మండలాల్లోనూ ఇదే తరహాలో ఖాళీలను భర్తీ చేశారు.

మరువలేని జ్ఞాపకం:

– రాజశేఖర్

మాది సామాన్య కుటుంబమే. ప్రైవేటు ఉపాధ్యాయుడిగా చేస్తూనే డీఎస్సీ రాశాను. సోషల్ స్టడీస్ ఉపాధ్యాయ పోస్టు దక్కింది. సర్కారు బడిలో తొలిసారి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పాఠాలను బోధించడం మరువలేని జ్ఞాపకం. విద్యార్థుల మనస్తత్వాన్ని బట్టి వారికి ఏ రీతిలో చెబితే అర్థం అవుతుందో అదే తరహాలో చెబుతా. ప్రభుత్వ బడుల్లో పిల్లలకు అన్ని విధాలా ప్రోత్సాహన్నందించాలన్నదే నా ఆకాంక్ష.

పేద విద్యార్థులకు సాయపడాలి:



ఉపేందర్, స్కూల్ అసిస్టెంట్, జడ్పీ ఉన్నత పాఠశాల, రామాపురం

మాది కొమరబండ. 2017లో డీఎస్సీ రాశా. ఎంపికవ్వలేదు. ప్రైవేటు ఉపాధ్యాయుడిగా, కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తూనే మళ్లీ రాశా. ఉపాధ్యాయ పోస్టు సాధించాలనే బాగా ప్రిపేరయ్యా. ఇదే వృత్తిలో కొనసాగుతా. పేద విద్యార్థులకు విద్యా పరంగా సాయపడాలి. వారిని ఉన్నత విద్యావంతులుగా చూసినప్పుడే సంతృప్తి ఉంటుంది.

గౌరవ ప్రదమైన వృత్తి: రాజేశ్వరి



సమాజంలో గౌరవ ప్రదమైనది ఉపాధ్యాయ వృత్తే. మా పెద్దమ్మ కొడుకులిద్దరూ ఉపాధ్యాయులే. వాళ్లలాగా నేనూ ఈ గౌరవ వృత్తిలో ఉండాలని భావించా. సాధించా. మొదటిసారి పిల్లల్ని పరిచయం చేసుకుంటుంటే భావోద్వేగం కలిగింది. జీవితంలో గుర్తుండిపోయే రోజు ఇదే కదా. ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలు దాదాపు పేదవారే. భవిష్యత్తులో వారిని మాలాగా తీర్చిదిద్దాలని కోరిక.

ఆరు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. సీసీఐ, వ్యవసాయ, మార్కెటింగ్, తూనికల కొలతల, పోలీస్, రవాణా, జిన్నింగ్ మిల్లుల యజమానులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తి క్వింటాకు సీసీఐ కనీస మద్దతు ధర రూ.7,521లుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఆరు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేస్తారని, సూర్యాపేటలోని బాలెంలో మంజిత్ కాటన్ ప్రైవేటు లిమిటెడ్, తిరుమలగిరిలో సిద్ధి ఫైబర్, సంతోషి మాత, శ్రీనివాస మిల్లులు, చింతలపాలెంలో డాక్టర్ అండ్ ఫ్రెండ్, భారతమ్మ మిల్లుల్లో కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కొనుగోళ్లపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని, మద్దతు ధరపై ప్రచారం చేయాలన్నారు. ఫైర్ అధికారులు మిల్లులు తనిఖీ చేసి నివేదిక అందించాలన్నారు. మిల్లుల యజమానులు హమాలీల, విద్యుత్తు సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ బీఎస్.లత, సూర్యాపేట మార్కెటింగ్ అధికారి సంతోష్, స్టేషన్ ఫైర్ అధికారి జానయ్య, డీపీసీ జనరల్ మేనేజర్ సీతారాం, ఆర్డీవో సురేశ్, డీఏవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు సన్నాహాలు


○ ఉమ్మడి జిల్లాలో 40 కేంద్రాల ఏర్పాటు


గతేడాది సూర్యాపేటలోని సీసీఐ కేంద్రానికి రైతులు విక్రయానికి తీసుకొచ్చిన పత్తి (పాతచిత్రం)

భానుపురి, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లాలో పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు భారత పత్తి సంస్థ(సీసీఐ) సిద్ధమైంది. ఏటా దళారులకు విక్రయించి నష్టపోతున్న రైతులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మొత్తం 40 సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. పత్తి సాగు పెరగడంతో కేంద్రాలనూ అధికంగా ఏర్పాటుచేస్తున్నారు. వీటిల్లో రైతులు దూది విక్రయించుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పించనుంది. ఈ సారి పత్తికి మద్దతు ధర పెంచి క్వింటాకు రూ.7,521 చెల్లిస్తుండటం అనుకూలించే అంశం.

వారం రోజుల్లో ప్రారంభం

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7.18 లక్షల ఎకరాల్లో ఈసారి అన్నదాతలు పత్తిసాగు చేపట్టారు. ఇప్పటికే మొదటి విడతగా దూది ఏరుతున్నారు. ముందుగా పత్తి ఏరిన కొందరు రైతులు కేంద్రాలు లేక దళారులకు విక్రయించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో వారం రోజుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు సీసీఐ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిన్నింగ్ మిల్లుల్లోనూ కొనుగోళ్లు జరిపేలా కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్రాలకు వచ్చి రైతులు ఇబ్బందులు పడకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. సరకు తెచ్చిన వెంటనే కొనుగోళ్లు జరిగేలా యంత్రాలను సిద్ధం చేస్తున్నారు.



పత్తి సాగు (ఎకరాల్లో..)
ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాలు

తేమ లేకుండా తీసుకురావాలి

– ఆర్.సంతోశ్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట

సీసీఐ కేంద్రాలకు పత్తి తీసుకొచ్చే రైతులు తేమ లేకుండా చూడాలి. నాణ్యమైన దూది తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు.

యూరియా.. ఎందుకు అమ్మడం లే..!



సహకార సంఘంలో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు (పాతచిత్రం)

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లాలో వరి, పత్తి, ఇతర పంటల సాగుకు వివిధ రకాల ఎరువులు వినియోగిస్తున్నారు. వీటిని గరిష్ఠ చిల్లర (ఎమ్మార్పీ) ధరకు లభ్యమయ్యే ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)లో రైతులు కొనుగోలు చేసేలా వెసులుబాటు కల్పించారు. పీఏసీఎస్‌లలో అన్ని రకాల ఎరువులు విక్రయించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా.. కొందరు సీఈవోలు పట్టించుకోవడం లేదు. దీంతో దూరంలో ఉన్న పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లి అధిక ధరకు ఎరువులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ధరలతో పాటు రవాణా ఛార్జీల భారం పడుతోందని వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్‌ల వివరాలు

జిల్లా	పీఏసీఎస్‌లు	ఎరువులు విక్రయించేవి	విక్రయించనవి
నల్గొండ	43	38	5
సూర్యాపేట	47	36	11
యాదాద్రి	25	19	6

ఉచిత రవాణా సౌకర్యం ఉన్నా..

సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 115 పీఏసీఎస్ కేంద్రాలున్నాయి. ఈ సంఘాలకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఎరువులను ఉచితంగా రవాణా చేస్తారు. ఈ అవకాశం ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో 22 సహకార సంఘాల వారు యూరియా తీసుకొచ్చి విక్రయించడం లేదు. దీంతో ఆ సంఘాల పరిధిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డీలర్లు యూరియా విక్రయించాలంటే వారే రవాణా ఖర్చులు భరించి దుకాణానికి తెచ్చుకోవాలి. దీంతో ప్రైవేటు వ్యాపారులు యూరియా కావాలంటే ఇతర ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు.

కమీషన్‌పైనే దృష్టి

అన్ని సంఘాల్లో డీఏపీ, 20-20, భారత్, ఐఎఫ్‌ఎఫ్‌సీవో, తదితర ఎరువులను విక్రయించాల్సి ఉంది. కానీ, ఇచ్చిన ఎరువులు మాత్రమే తీసుకోవాలని రైతులకు నిబంధన పెడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే రూ.కోట్లు కమీషన్ తీసుకుంటున్న సహకార సంఘాల నిర్వాహకులు యూరియా సరఫరా చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కారణాలు ఇలా..

★ గోదాము లేకపోవడంతో ఎరువులకు స్థలం దొరక్క పీఏసీఎస్ నిర్వాహకులు నిల్వ చేసుకోవడం లేదు.

★ యూరియా విక్రయించేందుకు, దిగుమతి, ఎగుమతి నిల్వ వివరాలు రాసుకునే సిబ్బంది, హమాలీలు లేకపోవడం.

★ ప్రభుత్వం నుంచే సరైన (దొడ్డు రకం) యూరియా సరఫరా కాకపోవడం.

విక్రయించాలని ఆదేశించాం

– పద్మ, డీసీవో, సూర్యాపేట

అన్ని సహకార సంఘాల్లో ఎరువులు విక్రయించాలని ఆదేశించాం. కొన్ని సంఘాల్లో విక్రయించడం లేదని మా దృష్టికి వచ్చింది. వెంటనే వాటిని తనిఖీ చేసి అందుకు గల కారణాలు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వచ్చే యాసంగిలో అన్ని సహకార సంఘాల్లో విక్రయించేలా చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

రెండో రోజు ఏడు గంటలకు పైగా విచారణ

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పోలీసుల కస్టడీలో ఉన్న తహసీల్దార్ జయశ్రీని, ధరణి ఆపరేటర్ జగదీశ్‌ను బుధవారం సీఐ చరమందరాజు రెండో రోజు 7 గంటలకు పైగా విచారణ చేశారు. ప్రధానంగా ప్రభుత్వ భూముల మార్పిడిపై విచారణ చేసినట్లు తెలిసింది. హుజూర్‌నగర్ పురపాలిక పరిధిలోని భూములు, ప్లాట్లు, హుజూర్‌నగర్, గరిడేపల్లి, హాలియా ప్రాంతాలలో ప్రభుత్వ భూములు ఏమైనా మార్పిడి జరిగిందా లేదా అన్నదానిపై విచారణ చేసినట్లు సమాచారం. ప్రభుత్వ భూములు మార్పిడి చేసే విధానంపై సీఐ చరమందరాజు వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఈ మార్పిడి నాయకుల ప్రోద్బలంతో జరుగుతుందా, జరిగితే ఎవరెవరు భాగస్వాములు అయ్యారన్న విషయంపై ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే ఉద్యోగ విధి నిర్వహణలో నిబంధనలు(సీసీ రూల్స్) పాటింపుపై పోలీసులు ప్రశ్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

మద్యనిషేధ గ్రామంగా పాతర్లపహాడ్

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని పాతర్లపహాడ్ గ్రామ పంచాయతీలో మద్యాన్ని ముట్టుకోబోమంటూ అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా చేసిన తీర్మానం బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు గ్రామంలో మద్యనిషేధ కమిటీ ఛైర్మన్ దొంతగాని కర్ణాకర్ ఆధ్వర్యంలో అఖిల పక్షాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా, యువజన సంఘాలు, పోలీసులు, గ్రామస్థాయి అధికార సిబ్బంది పెద్దఎత్తున ర్యాలీ తీశారు. గొలుసు దుకాణదారుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. ఇప్పటినుంచి గ్రామంలో మద్యాన్ని అమ్మినా, తాగినా రూ.20వేల జరిమానా విధించనున్నట్లు తెలిపారు. సమాచారం తెలిపిన వారికి రూ.2వేలు ప్రోత్సాహకంగా ఇస్తామన్నారు. ఏఎస్ఐ శంకర్‌నాయక్, మాజీ ప్రజాప్రతినిధులు గణపారపు సత్యం, గణపారపు నారాయణ, మల్లయ్యయాదవ్, డానియోల్, వంశీ, వీరన్న, కమిటీ సభ్యులు సందజానయ్య, వెంకన్న, శ్రీశైలం, పంచాక్షరి, పులి వినోద, నగేష్, జహీర్‌బాబా, జయలలిత, నాయిని సైదులు తదితరులు పాల్గొన్నారు.


పాతర్లపహాడ్ అంబేడ్కర్ సెంటర్లో ర్యాలీగా తరలివచ్చిన మద్యపాన నిషేధ కమిటీ బృందం, పోలీసులు, తదితరులు

కేతిరెడ్డి ఆనకట్ట పరిశీలన

తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గొట్టిపర్తి సమీపంలోని కేతిరెడ్డి ఆయకట్టు కాలువలను బుధవారం సాయంత్రం నీటిపారుదల శాఖ ఎస్ఈ శివధర్మతేజ పరిశీలించారు. గతనెలలో కురిసిన భారీ వర్షాలకు ఆయకట్టు లింకు కాలువలు, మత్తడి పూర్తిగా తెగిపోవడంతో స్థానిక రైతులు సాగునీటికొరతతో ఇబ్బందులు పడుతున్న సమస్యను ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకువెళ్లారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎమ్మెల్యే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడి ఈ ప్రాంత రైతుల సమస్యను పరిష్కరించాలని కోరారు. సుమారు 6.5 కిమీ దూరం ఉండే కాలువ ఆధునికీకరణ పనుల కోసం సుమారు రూ.13 కోట్లు వెచ్చించాలని అధికారులు ప్రాథమికంగా అంచనవేశారు. నీటిపారుదలశాఖ అధికారులు ఆయకట్టు, లింకుకాలువలను, సమీపంలోని చెరువులను పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వీరి వెంట ఈఈ సత్యనారాయణ, డీఈ నవీన్, ఏఈ శ్రీకాంత్, గ్రామస్థులు వెంకన్న, వెంకన్న, యల్లేష్, అరవయ్య ఉన్నారు.


గొట్టిపర్తిలో రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ శివధర్మతేజ

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందండిలా..

మీకోసం

ఆలేరు, న్యూస్‌టుడే: విద్య, ఉపాధి, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఇదే క్రమంలో వారికి ఆయా దేశాల్లోని ప్రసిద్ధ ప్రాంతాలు, అవసరాల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఈ క్రమంలో డ్రైవింగ్ లైసెన్సుల అవసరం అవుతోంది. విదేశాలలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లేవారిలో చాలా మంది అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ (ఐడీఎల్) కోసం రవాణాశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సరైన అవగాహన లేక దళారులను ఆశ్రయిస్తూ అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానంపై కథనం.



భువనగిరిలోని రవాణా శాఖాధికారి కార్యాలయం



భారత్‌లో ఏడాది గడువుతో జారీ అయిన అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్ (పాతచిత్రం)



అమెరికాలో జారీ చేసే డ్రైవింగ్ లైసెన్స్ కార్డు నమూనా



యూఏఈలో జారీ అయిన డ్రైవింగ్ లైసెన్స్

వీసాను జతచేయాలి..

◆ అంతర్జాతీయ లైసెన్స్ పొందాలంటే ముందుగా స్వదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఐడీఎల్‌కు దరఖాస్తు చేసే సమయంలో ఇక్కడ తీసుకున్న డీఎల్‌తో పాటు పాస్‌పోర్టు (గడువు 6 నెలలైనా ఉండాలి), మనం ఏ దేశానికి వెళుతున్నామో ఆ దేశానికి సంబంధించిన వీసాను జతచేయాలి.

◆ వీసా త్వరగా వస్తుందనుకుంటే అందుకు సంబంధించిన ఆధారాలు అందజేయాలి. ఆరోగ్య రంగా వైద్య ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఫాం-ఎ జతచేసి పూర్తి వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. కేటాయించిన తేదీన ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఐడీఎల్ జారీ చేస్తారు. ◆ నల్గొండ ఉమ్మడి జిల్లాలో 1.1.2020 నుంచి 30.9.2024 వరకు సుమారు 1,700 మంది వరకు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకున్నారు. నల్గొండ జిల్లాలో 720, సూర్యాపేట 600, యాదాద్రి భువనగిరి జిల్లాలో 380 వరకు తీసుకున్నారు.

ఉన్నత విద్య కోసం...

ఉన్నత విద్య అభ్యసించడానికి అమెరికా, గ్రేట్ బ్రిటన్, కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, రష్యా తదితర దేశాలకు వెళుతున్నారు. ఆయా దేశాలకు వెళ్లినవారిలో కొందరు అక్కడే స్థిర పడుతుండగా, మరికొందరు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆయా దేశాలలో కారు తప్పనిసరైంది. ఈ క్రమంలో చాలామంది ఐడీఎల్‌లు తీసుకుంటున్నారు.


లెర్నింగ్ లైసెన్స్ మాదిరిగానే..

రాష్ట్ర రవాణాశాఖ జారీచేసే అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. దీని ఆధారంగా ఆయా దేశాలలో వాహనాలు నడపడానికి అనుమతిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే మనదేశంలో పొందిన ఐడీఎల్ ఆయా దేశాలలో లెర్నింగ్ లైసెన్స్‌లా ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. అక్కడి నిబంధనలకు లోబడి గడువులోగా అక్కడి లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.

అమెరికాలో ఇలా...

అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కఠిన నిబంధనలు ఉంటాయి. మనదేశంలో మాదిరిగానే లెర్నింగ్ లైసెన్స్ తీసుకోవడానికి ముందు టెస్ట్ ఉంటుంది. అందులో ఉత్తీర్ణులైతే లెర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. అనంతరం డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం కూడా టెస్ట్ రాయాల్సి ఉంటుంది. డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించేప్పుడు పక్కన ఎంవీఐ కూర్చుని మన డ్రైవింగ్‌ను పరిశీలిస్తారు. సెన్సార్ల ద్వారా మన కదలికను పరిశీలించడంతో పాటు ఫొటోలు కూడా తీస్తారు. డ్రైవింగ్ చేసేప్పుడు పొరపాట్లు చేస్తే వాటిని రుజువులుగా చూపుతూ లైసెన్స్ జారీని తిరస్కరిస్తారు.

విలువలు నేర్పుదాం..!



'మనం బాగున్నప్పుడు లెక్కలు మాట్లాడి. కష్టాల్లో ఉన్నప్పుడు విలువలు మాట్లాడకూడదు.' – సినీ రచయిత త్రివిక్రమ్



'వ్యాపార నిర్వహణ విషయంలో ఆధిపత్యం, సంపద గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. విలువలు, విశ్వసనీయత పైనే ప్రధానంగా దృష్టి పెట్టాను.' – రతన్ టాటా

◆ నేడు 'ప్రపంచ విలువల దినోత్సవం'

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు కేవలం పుస్తకాలు, మార్కులు, ర్యాంకులు, ఉద్యోగాలు, డబ్బే జీవితం అనుకుంటున్నారు. అలా అనుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారుల మనసులను మార్చేస్తున్నారు. దీంతో కొంత వయసొచ్చాక విద్యార్థులకు మంచి, చెడులు, బంధాలు, బంధుత్వాలు, మానవత్వం.. వంటి వాటిపై విచక్షణ కోల్పోయి, మరమనుషులా మారిపోతున్నారు. దీన్ని మార్చాలనే ప్రపంచ నియంత్రించడంతో విలువల ప్రాధాన్యం తెలిపేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ 2016 నుంచి ఏటా అక్టోబరు 17న 'ప్రపంచ విలువల దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

పాఠశాలల్లోనే బీజం పడాలి..

సమాజం, మానవీయత, బంధాలు, మంచి చెడులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాలే అనువైన ప్రదేశం అని నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే మంచి విలువలు, కట్టుబాట్లు అలవరచడం ద్వారా సమాజం లోని అనేక సామాజిక రుగ్మతలను పాటు ప్రస్తుతం వెలుగు చూస్తున్న అనేక నేరాలకు చెక్ పెట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా తల్లిదండ్రులు, తోబుట్టువులు, కష్టజీవులు, వారు, పిల్లలు, బంధువులు, మిత్రులతో ఎలా మసలుకోవాలి.. వారి కంటే డబ్బు, ఇతర ఆస్తులు ఏవీ ముఖ్యం కాదనే విషయం విద్యార్థుల్లో బలంగా నాటుకుపోవాలి.

❑ ప్రజల్లో విలువలు దిగజారితే ఎన్నో అనర్థాలు జరుగుతాయి. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అనేక ఘటనలు దీనికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని విద్యార్థుల వివరాలు..

మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు:	4,206
ఆరేళ్ల లోపు చిన్నారులు:	1,64,527
మొత్తం పాఠశాలలు:	3,210
పాఠశాల విద్యార్థులు:	2,11,009
మొత్తం గురుకులాలు:	84
గురుకులాల్లోని విద్యార్థులు:	45,360

ఫోన్‌లో మునిగిపోతున్నారు..

డాక్టర్ రాజశేఖర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, కోదాడ



సాధారణంగా పిల్లల్లో విలువల పెంపునకు కుటుంబమే కేంద్రం. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండడంతో తల్లిదండ్రులు, తాతలు, నానమ్మ, అమ్మమ్మలు పిల్లలకు వైతిక విలువలు బోధించేవారు. అయితే నేటి పరిస్థితుల్లో ఇంట్లో ఉన్న నలుగురిలో తలో పనిలో.. ఫోన్‌లో మునిగి పోతుండడంతో చిన్నారుల్లో విలువలు కనుమరుగవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో కొందరు విలువలు మరిచి చేసిన ఘటనలివీ..

❑ వేములపల్లి మండలంలో ఓ భర్త భార్యపై అనుమానం పెంచుకుని ఆమెను కాలువలో తోసి హత్య చేశాడు.

❑ ఈ ఏడాది మేలో సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని ఓ గ్రామంలో డబ్బుల కోసం తల్లి అంత్యక్రియలు జరగకుండా కుమారుడు అడ్డుపడిన ఘటన విస్మయగొలిపింది.

❑ 2021లో సూర్యాపేట జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ చదివి విదేశాలకు వెళ్లిన ఓ కుమారుడు డబ్బు ఇవ్వలేదని కన్నతండ్రిని బకెట్‌తో కొట్టి హత్య చేశాడు.

❑ 2019లో సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంకు చెందిన ఓ తండ్రి భార్యపై కోపంతో నాలుగేళ్ల కుమారుడిని మెడ కొరికి, పిన్నీసులతో గుచ్చి అతి కిరాతకంగా హత్య చేశాడు.

మైహోం సంస్థకు అవార్డు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: సిమెంటు తయారీలో ఉన్నత నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నందుకు మైహోం ఇండస్ట్రీస్ అవార్డు అందుకుంది. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, భారత ప్రభుత్వ హైదరాబాద్ శాఖ తరఫున అందించిన ఈ అవార్డు, ప్రశంసా పత్రాన్ని సంస్థ ప్రతినిధులు అందుకున్నట్లు మేళ్లచెరువు యూనిట్ హెడ్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన మేరకు నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో సంస్థ యాజమాన్యం రాజీ పడలేదన్నారు. ఉద్యోగుల సమష్టి కృషితోనే ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వగా, ఇండస్ట్రీస్ కమిషనర్ మల్సూర్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (హైదరాబాద్) డైరెక్టర్ పి.వి.శ్రీకాంత్ చేతుల మీదుగా సంస్థ సీనియర్ డీజీఎం విజయ భాస్కర్‌రెడ్డి ఈ అవార్డు అందుకున్నారు.



శ్రీకాంత్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మైహోం సంస్థ ప్రతినిధి విజయ్ భాస్కర్‌రెడ్డి

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: మానసిక రుగ్మతతో బాధపడుతున్న విద్యార్థి బలవన్మరణం చెందిన ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన విద్యార్థి(18) భువనగిరిలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గత కొన్ని నెలల నుంచి ఓసీడీ అనే మానసిక రుగ్మతతో బాధపడుతూ బీబీనగర్ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవపంచనామా కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి పంపినట్లు సీఐ సాల్మన్‌రాజు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు తక్షణమే చెల్లించాలి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను తక్షణమే చెల్లించాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం వచ్చి 10 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఉపకారవేతనాలు, బోధన రుసుములు విడుదల చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల కాకపోవడంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని తెలిపారు. మూడు ఏళ్లుగా విడుదల కాని ఆర్‌టీఎఫ్ వల్ల అన్ని కళాశాలలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రైవేటు కళాశాల యాజమాన్యం రూ.కోట్లలో అప్పులు తెచ్చి అవి తీర్చలేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉమ్మడి జిల్లాలో అనేక కళాశాలలు మూత వేసే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని ఎన్జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు రాంమోహన్, నర్సింహారెడ్డి, జనయ్య, సత్యంగౌడ్, ప్రవీణ్, హన్మంతు, వెంకటరెడ్డి, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నల్గొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులు, అధ్యాపకులు

చికెన్ ధరలు

ఫారంరేటు	126–00
రిటైల్	146–00
డ్రస్ట్	215–00
స్కిన్‌లెస్	244–00

మైదానం తోడుగా.. ఉద్యోగ సాధన



నడిగూడెంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం

★ ఒకే గ్రామంలో 50 మందికి పైగా వ్యాయామ శిక్షకులు

నడిగూడెం, న్యూస్‌టుడే: వ్యాయామ విద్యను అభ్యసించిన 50 మందికి పైగా నడిగూడెం యువకులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వ్యాయామ శిక్షకులుగా రాణిస్తున్నారు. అందుకు ప్రధాన కారణం నడిగూడెంలో దాత కొల్లు పాపయ్య చౌదరి విరాళంతో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విశాలమైన క్రీడా మైదానం అందుబాటులో ఉండటమే. నిత్యం వందల సంఖ్యలో యువతీ, యువకులు ఇక్కడ సాధన చేస్తుంటారు. దీనివల్లే ఎక్కువ మంది పోలీస్ కానిస్టేబుల్, వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికవుతున్నారు. ఇటీవల నిర్వహించిన పలు వ్యాయామ ఉద్యోగ నియామకాల్లో నలుగురు ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన పలువురు వ్యాయామ ఉపాధ్యాయులుగా పలు చోట్ల విధులు నిర్వహిస్తున్నారు.

క్రీడలపై మక్కువతోనే...

– పి.ప్రకాష్, జడ్పీ హెచ్ఎస్, చెవ్వెంల



గ్రామంలో విశాలమైన క్రీడా మైదానం అందుబాటులో ఉండటం, నిత్యం సాధన చేయడంతో పాటు, క్రీడలపై ఉన్న ఆసక్తితో ఉద్యోగం సాధించాను. ఇక్కడ పది, ఇంటర్ పూర్తి చేసిన అనంతరం వ్యాయామ శిక్షణ కోర్సు పూర్తి చేసి ఉద్యోగం సాధించాను. నేటి యువతకు నిత్యం శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నాను.

యువతకు శిక్షణనిస్తున్నా...

– పి.నాగేశ్వరరావు, జడ్పీ హెచ్ఎస్, తుమ్మగూడెం



వ్యాయామ శిక్షణ కోర్సు పూర్తి చేసి తొలి ప్రయత్నంలోనే ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను. అందుబాటులో ఉన్న మైదానంలో యువతకు పోలీసు ఉద్యోగాలు, ఇతర ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాను. వేసవి సెలవులు, దసరా సెలవుల్లో నిర్వహించే ప్రత్యేక క్రీడా పోటీలకు నా వంతు సహకారం అందిస్తున్నా.

నిత్య కృషితోనే...

కె.స్వజన్, మైనార్టీ గురుకుల పాఠశాల, సూర్యాపేట



వ్యాయామ విద్య శిక్షణ పూర్తి చేశాను. పలు ప్రైవేటు, పాఠశాల, కళాశాలల్లో పీఈటీగా విధులు నిర్వహించా. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో నిత్యం కృషి చేస్తూ కలను సాకారం చేసుకున్నాను. నిత్య సాధనతోనే ప్రభుత్వ ఉద్యోగం సాకారమైంది. మైనార్టీ గురుకుల పాఠశాలలో పీఈటీగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

ఎంతో ఆనందంగా ఉంది...

కె.శ్యామల, మైనార్టీ గురుకుల పాఠశాల, కోదాడ



మైనార్టీ గురుకుల పాఠశాలలో పీఈటీ ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంతో సొంతంగా సాధన చేసి తొలి ప్రయత్నంలోనే సాధించాను. నేటి యువత సాధన చేస్తే ఏలాంటి కొలువునైనా ఇట్టే సాధించవచ్చు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మురళి, చిత్రంలో జాతీయాధ్యక్షుడు స్వామి, తదితరులు

సుభాష్‌నగర్(కరీంనగర్), న్యూస్‌టుడే: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జిల్లాలో పద్మశాలీలు రాజకీయ బలంతో ఉండి, సత్తా చాటాలని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ పద్మశాలి ట్రస్టు భవనంలో ఆ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జాతీయాధ్యక్షుడు కందగట్ల స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ.. గడువు పూర్తయిన జిల్లా శాఖలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కరీంనగర్ మేయర్ పదవి కేటాయించేలా రాజకీయ పార్టీలను కోరాలని తీర్మానం చేశామన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మార్చిలో పది వేల మందితో అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభను ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం రూ.లక్ష విరాళంగా ప్రకటించడాన్ని అభినందించారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ వాసాల రమేశ్, ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచంద్రం, మున్సిపల్ ఛైర్మన్ రుద్రరాజు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆ ప్రతిపాదనకు పదేళ్లు



పునర్నిర్మాణంతో రూపొందిన యాదాద్రి పంచ నారసింహుల దేవాలయం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట స్వయంభూ క్షేత్రాన్ని మరో తిరుమలగా తీర్చిదిద్దాలని రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ తలంపునకు గురువారం నాటికి పదేళ్లు నిండనున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన యాదగిరిగుట్ట క్షేత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం యాదాద్రిగా పేరు మార్చి అరకరంలోని దేవాలయాన్ని 4.03 ఎకరాలకు విస్తరించి సంపూర్ణంగా కృష్ణశిలతో ఆవిష్కరించారు. ఆలయంతో పాటు ఇతర వనరులతో క్షేత్రాభివృద్ధి కోసం సుమారు రూ.1200 కోట్ల ఖర్చైనట్లు వైటీడీఏ వెల్లడించింది.

★ రాష్ట్ర ప్రధాన పుణ్యక్షేత్రాలు దశలోనే 2007లో కేసీఆర్ ఈ క్షేత్ర సందర్శించారు. ఆలయాన్ని విశ్వఖ్యాతి గాంచేలా పునర్నిర్మించాలని తలచారు. నాటి ఆలోచనను సీఎం హోదాలో 2014 అక్టోబరు 17న వెల్లడించారు. కొండకింది పెద్దగుట్ట పై సేకరించిన 850 ఎకరాలలో లేఅవుట్ పనులతో విశాల రహదారులు, హరితమయ ప్రాంగణాలు, కాటేజీల నిర్మాణానికి ప్లాట్ల ఏర్పాటుతో 250 ఎకరాలు రూపుదిద్దుకున్నాయి.

★ కొండ కింద ఉత్తర ముఖంగా సేకరించిన భూముల్లో ఆలయానికి చెందిన వనరులతో ఆధ్యాత్మిక వాడగా రూపొందింది. సమీపాన చిన్న కొండ పై వీవీఐపీల కోసం 14 విల్లాలు, ఒక ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మించిన విషయం తెలిసిందే. భక్తుల పుణ్యస్నానాలకు లక్ష్మీపుష్కరిణి నిర్మించారు. కళ్యాణ కట్ట, వ్రత మండపం, అన్న ప్రసాదం అందించే సముదాయం, ఆర్టీసీ బస్టాండ్ నిర్మించారు.

★ కొత్తగా కొండపైన భక్తుల నిద్ర చేసేందుకు డార్మెటరీ హాల్, గుండంలో సంకల్ప స్నానం, ప్రసాదాల కొనుగోలు కోసం ప్రత్యేక టికెట్ కౌంటర్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు దేవస్థానం నిర్మిస్తోంది.

★ దేవాలయ విమానం స్వర్ణమయం రూపకల్పనకు ఈ మధ్యే శ్రీకారం చుట్టారు. 60 కేజీల బంగారంతో స్వర్ణవిమానం రూపకల్పనకు ప్రస్తుత రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో, స్థానిక ఎమ్మెల్యే, విప్ బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో యాదాద్రి దేవస్థానం పనులు సదరు పనులకు నడుం బిగించిన విషయం తెలిసిందే.

పంటకాలానికి రైతు బంధు రూ.7,500 ఇస్తాం

◆ ఈ ఏడాది నుంచే పంటల బీమా అమలు: మంత్రి తుమ్మల



నల్గొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి తేమ శాతం పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి



హాలియా: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి, జానారెడ్డి తదితరులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుబంధు పంట కాలానికి రూ.7,500 ఇస్తామని.. ఈ ఏడాది నుంచే పంటల బీమాను కూడా అమలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం నల్గొండలోని ఎన్జీకాలేజ్ మార్కెట్ యార్డులో పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతుల పై పైసా పడకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంటల బీమా ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

★ గడిచిన 5 ఏళ్లలో బ్యాంకులో రైతు పేరున ఉన్న రుణం ఉన్నా.. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ మేరకు 22 లక్షల తెల్లరేషన్లు కలిగిన రైతులకు ఇప్పటికే రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేస్తూ వారి ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ఈ నెలాఖరు నాటికి తెల్ల కార్డులు లేని 4 లక్షల మంది రైతులకు వారి ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేస్తామన్నారు. రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులకు కూడా రుణ మాఫీ చేసేందుకు షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. నల్గొండలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

★ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే నల్గొండ జిల్లాలో అత్యధికంగా ధాన్యం పండుతుందన్నారు. రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి కేంద్రాలకు తీసుకొస్తే రూ.24 గంటల్లో కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం రైతుల తరఫున నల్గొండలోనే ఏర్పాటుకు బత్తాయి సాగవుతుందని.. గతంలో ఏర్పాటు చేసిన బత్తాయి మార్కెట్‌లో కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు చేయాలని తుమ్మల దృష్టికి కోమటిరెడ్డి తీసుకెళ్లారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది..

హాలియా: స్థానిక లక్ష్మీనర్సింహ గార్డెన్‌లో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎల్పీ మాజీనేత కుందూరు జానారెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

★ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం లాంటి బోగస్ ప్రాజెక్టు కట్టి రాష్ట్రాన్ని రూ.ఏడు లక్షల కోట్ల అప్పులపాలు చేసిందని విమర్శించారు. రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేస్తామన్నారు. మార్కెట్ ఛైర్మన్ పదవి కాదని, అది బాధ్యతని, రైతులకు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటూ రైతాంగానికి అండగా ఉండాలని వారు తెలిపారు.

★ ముందుగా పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి బారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి వచ్చారు. అనంతరం వ్యవసాయశాఖ జిల్లా అధికారి శ్రావణ్‌చేత నూతన ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ కలసాని చంద్రశేఖర్, పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, పీసీసీ డెలికేట్ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, హాలియా, నందికొండ పురపాలక ఛైర్మన్లు యడవల్లి అనుపమరెడ్డి, అన్నపూర్ణ, రాష్ట్ర కార్యదర్శి కొండేటి మల్లయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

పేదల గొంతుక ప్రజా నాట్యమండలి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: దేశంలో ఎనిమిది దశాబ్దాలుగా పేద ప్రజల గొంతుకగా ప్రజా నాట్యమండలి నిలిచిందని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన తెలంగాణ ప్రజా నాట్యమండలి జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. బ్రిటిష్ పాలకుల దురాగతాలను, తెలంగాణలో నిజాం నవాబు అరాచకాలను, వారి దుశ్చర్యలను కళారూపాలుగా మలచి ప్రజలను చైతన్య పరిచిందన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. ప్రజా నాట్యమండలి జీవనది లాంటిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ, రాములు, ధనుంజయ నాయుడు, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

నడిగూడెం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి యోజన పథకం కింద అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సంక్షేమ పథకాల మానిటరింగ్ కమిటీ నల్గొండ పార్లమెంట్ కన్వీనర్ వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
80085 50363
96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని లక్ష్మీపురం కాలనీలో మురుగు కాలువలు లేక మురుగు నీరు రహదారులపై ప్రవహిస్తుంది. మురుగు కాలువలు ఏర్పాటు చేయాలి. —సాయి, కోదాడ

✔ నిధులు మంజూరు కాగానే మురుగు కాలువలు ఏర్పాటు చేస్తాం. —రమాదేవి, పుర కమిషనర్, కోదాడ

సన్నాలకు రూ.500 బోనస్: ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

మోతె, న్యూస్‌టుడే: ఈ వానాకాలం సీజన్ నుంచి రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500లు బోనస్ ఇస్తుందని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు.



మోతె మండలకేంద్రంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

మండలకేంద్రంలో బుధవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యానికి గ్రామంలోనే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసేందుకు ఐకేపీ, ప్యాక్స్, మ్యాక్స్‌ల ఆధ్వర్యంలో అవసరమైన ప్రతిచోటా కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, బి గ్రేడ్ ధాన్యానికి రూ. 2,300ల చొప్పున ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందని, వీటితో పాటు కేంద్రంలో సన్నరకం ధాన్యం తెచ్చిన రైతులకు క్వింటాలుకు రూ.500లు అదనంగా బోనస్ అందుతుందన్నారు. కోతలు ఆరంభం కాగానే రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. తహసీల్దార్ సంఘమిత్ర, ఏవో అరుణ, ఏపీఎం వెంకయ్య, సంఘబంధం అధ్యక్షురాలు రమణ పాల్గొన్నారు.

కోదాడ: విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఉన్నత చదువులు చదివి కోదాడకు పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. దసరా పండగకు విదేశాల్లో చదువుతున్న విద్యార్థులు కోదాడకు రావడంతో వారితో సమావేశమై మాట్లాడారు. అనంతరం వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు చీరను బహూకరించారు.

ఆదమరిస్తే అంతే..!

మలుపులు, రహదారుల పక్కనే ఉన్న బావులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఏ మాత్రం ఏమరుపాటుగా ప్రయాణం చేసినా ప్రమాదం తప్పదు. మలుపుల వద్ద ఇరువైపులా ఉన్న బావుల వద్ద నుంచి వెళ్లాలంటే వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఉన్న బావుల వద్ద సూచిక బోర్డులు లేవు. ఉన్నా సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.

—మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే:

పరిశీలన

మూలమలుపుల వద్దే బావులు..



విజయరాఘవాపురం శివారులో మలుపు వద్ద బావి చుట్టూ ఏపుగా పెరిగిన చెట్లు

మొద్దుల చెర్వు నుంచి మోతె వెళ్లే ప్రధాన రహదారిలో విజయరాఘవాపురం, నర్సింహులగూడెం శివారులో సుమారు నాలుగు బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. మునగాల నుంచి నడిగూడెం వెళ్లే రహదారిలో నారాయణగూడెం శివారులో ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద బావులు ఉన్నా అక్కడ హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్న చోట అధికారులు గుర్తించి రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కానీ వారు పట్టించుకోకపోవడం, వర్షాకాలం కావడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదాలు చోటు చేసుకునే ఆస్కారం ఉంది. తక్షణమే అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి రక్షణ వలయాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

★ ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ సత్యనారాయణను వివరణ కోరగా మొద్దులచెర్వు నుంచి మోతె వరకు రెండు వరుసల రహదారి మంజూరైందని, త్వరలోనే రహదారుల వెంట ఉన్న బావులను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. లేదంటే రహదారి పనులు పూర్తికాగానే వాటి వద్ద సూచికలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు:



జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఐదు వందలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల ఎదురుగా విద్యుత్తు సర్వీస్ వైర్లు పాఠశాల గోడకు అనుకొని ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సైకిళ్లను నిలిపేందుకు అక్కడే స్టాండ్ ఏర్పాటు చేయడంతో వారు విద్యార్థులు భయభ్రాంతులకు లోనవుతున్నారు. విద్యుత్తు అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. విద్యుత్తు తీగలను వెంటనే సరి చేస్తామని, తీగలు కిందకు రాకుండా చర్యలు తీసుకుంటామని ఏఈ మల్లెల శ్రీనివాసరావు తెలిపారు.

—కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

మురుగు కాల్వల్లో పూడిక తొలగింపు

స్పందనకు వందనం

మఠంపల్లి, న్యూస్‌టుడే: రామచంద్రాపురంతండా గ్రామ పంచాయతీలో సిబ్బంది అంతఃకలహాలతో విధులను నిర్లక్ష్యం చేస్తున్న విషయంపై 'ఈనాడు'లో బుధవారం 'సిబ్బంది నిర్లక్ష్యం.. పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికతో వెలువడిన కథనానికి జీపీ ప్రత్యేక అధికారి జయచంద్ర స్పందించారు. ఇక్కడి మురుగు కాల్వల్లో నెలల తరబడి పూడిక తీయక దోమలతో స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నట్లు తెలుసుకున్న ఆయన కథనం వెలువడిన రోజే సిబ్బందిని పురమాయించి కార్యదర్శి నాగరాజు పర్యవేక్షణలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేలా చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని అన్ని కాల్వల్లో చెత్తా, చెదారాలను తొలగిస్తున్నట్లు ప్రత్యేక అధికారి తెలిపారు.

రూ.40 కోట్లతో అంతర్గత రహదారుల నిర్మాణం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు పద్మావతిరెడ్డిల ప్రత్యేక చొరవతో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో అంతర్గత రహదారులకు రూ.40 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉత్తర్వుల ప్రతులను మంత్రి విలేకరులకు పంపించారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలో దాదాపు దశాబ్దకాలంగా మరమ్మతులకు నోచుకోని గ్రామాల అంతర్గత రహదారులకు ఈ నిధులతో కొత్త రహదారులు వేయనున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గానికి రూ.25 కోట్లతో నియోజకవర్గ పరిధిలోని 23.90 కిలోమీటర్ల మేరకు అంతర్గత రహదారులను నిర్మిస్తారు. కోదాడ నియోజకవర్గానికి రూ.15 కోట్లతో 13.70 కిలోమీటర్ల మేర రహదారులు కొత్తగా వేస్తారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిని అసలు నడవలేని పరిస్థితిలో రహదారులు ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల, రెండు నియోజకవర్గాల నాయకులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దృష్టికి తీసుకుపోవటంతో రూ.40 కోట్లు మంజూరయ్యాయి. దీనిపై పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోండి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా, సూర్యాపేట జిల్లా ఇన్‌ఛార్జి వంగవీటి శ్రీనివాసరావు, సూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ నవీన్ అన్నారు. కోదాడలో సమాచార హక్కు రక్షణ చట్టం-2005 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. అనంతరం కేకు కోసి మిఠాయిలు పంపిణీ చేశారు. గోపి, ముత్తయ్య, వికిల్, అమీర్, తదితరులున్నారు.



కేకు కోస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా, సూర్యాపేట జిల్లా ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు

భూసేకరణపై అవగాహన

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణానదిపై గుండెబోయినగూడెం వద్ద నిర్మాణం చేయనున్న ఎత్తిపోతల పథకం సాగర్ ఆయకట్టు చివరి ప్రాంత రైతులకు వరప్రదాయని అని ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. తహసీల్ కార్యాలయంలో బుధవారం పైపులైను నిర్మాణాల వల్ల భూములు కోల్పోతున్న రైతులకు అవగాహన కల్పించారు. గుండెబోయినగూడెం, గుండ్లపహాడ్, బొత్తలపాలెం, కోమటికుంట, జాన్‌పహాడ్ గ్రామాల్లో పైపులైను నిర్మాణం కోసం 37.20 ఎకరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. భూమి రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం ఒకటిన్నర నుంచి మూడు రెట్ల వరకు నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. సాగు భూమిలో చెట్లు, మోటార్లు, పైపులైన్లు ఉంటే మార్కెట్ ధరల ప్రకారం పరిహారం అందించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో పైపులైన్ల నిర్మాణం కోసం సర్వే చేసిన అధికారులు స్థానిక రైతులకు సమాచారం అందించలేదని కొంతమంది రైతులు ఫిర్యాదు చేయగా, శుక్రవారం రైతుల సమక్షంలో మరోమారు రీ సర్వే చేపడతామని స్పష్టం చేశారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ కమలాకర్, భూ సేకరణ విభాగం నాయబ్ తహసీల్దార్ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ సైదా పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు పోరాడాలి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: కుల, మత, భాషలకతీతంగా ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు పోరాడాలని కుల వివక్షత పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు మతోన్మాద శక్తులు అనేక కుట్రలు పన్నుతున్నాయని తెలిపారు. యోగానందం భవన్‌లో బుధవారం జరిగిన కేవీపీఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోని భాజపా ప్రభుత్వం రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. ఒకే దేశం ఒకే ఎన్నికలు అని చెబుతున్న భాజపా ప్రభుత్వానికి ఒకే దేశం ఒకే కులం అని చెప్పే ధైర్యం ఉందాని ప్రశ్నించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

★ అంతకు ముందు జరిగిన విలేకర్ల సమావేశంలో స్కైలాబ్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. దళితులకు దళితబంధు ఇవ్వాలని కోరారు. కులాంతర వివాహం చేసుకున్న వారిని కూడా గణన చేయాలన్నారు.

ప్రింటర్ బహూకరించిన పూర్వ విద్యార్థులు

పెంచికల్‌దిన్న జడ్పీహెచ్ఎస్‌లో 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాలకు మల్టీపర్పస్ ప్రింటర్‌ని పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావుకి అందజేశారు. దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తున్నాయని హెచ్ఎం తెలిపారు. -నేరేడుచర్ల, న్యూస్‌టుడే:



మత్స్య సంఘాల అభివృద్ధికి కృషి

మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే: మత్స్య సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా మత్స్య సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ శ్రీను అన్నారు. మాధవరం చెరువులో బుధవారం ఉచితంగా చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. మత్స్య సంపదను పెంపొందించుకుని గ్రామ మత్స్య సంఘాలు అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగుల్ నాయక్, ఎంపీడీవో రమేశ్ దీనదయాళ్, పంచాయతీ కార్యదర్శి అక్షిత, నాగయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాధవరం చెరువులో చేపలను వదులుతున్న అధికారులు

విద్యార్థుల హక్కుల కోసమే పోరాటం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దోత్సవ సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు అన్నారు. కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సభలకు సంబంధించిన గోడ పత్రికలను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. కోదాడలో ఈనెల 20న, ఓయూలో 24న జరిగే సభలను విజయవంతం చేయాలని కోరారు. 50 ఏళ్లుగా విప్లవ ప్రస్థానంలో విద్యార్థుల హక్కుల కోసం వీరోచితంగా పోరాడిందన్నారు. నాయకులు రాఖీ, వేణు, గౌతమ్, సంధ్య, స్వప్న, మౌనిక, జ్యోతి, తదితరులున్నారు.



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు, నాయకులు

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: డీఎస్సీలో అర్హత సాధించి ఉపాధ్యాయ పోస్టులు పొందిన వారు తమ విధులను అంకిత భావంతో నిర్వహించాలని మండల విద్యాధికారి వెంకటరెడ్డి అన్నారు. మేళ్లచెరువు మండలంలో పోస్టింగ్ లభించిన వారికి అనుమతి పత్రాలను బుధవారం అందజేసి మాట్లాడారు. అనంతరం మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లో వారికి కేటాయించిన పాఠశాలల్లో బుధవారం విధుల్లో చేరారు.



నేరేడుచర్ల: ఎంఈవో సత్యనారాయణరెడ్డి నుంచి పత్రాలు అందుకున్న నూతన ఉపాధ్యాయులు

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలానికి కేటాయించిన ముగ్గురు ఉపాధ్యాయినులు బుధవారం విధుల్లో చేరినట్లు ఎంఈవో పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. వీరికి శాంతినగర్, బూర్గులతండా, సోమారం ప్రాథమిక పాఠశాలలకు కేటాయించినట్లు చెప్పారు. బదిలీపై మరో నలుగురు ఉపాధ్యాయులు మండలానికి వచ్చినట్లు వెల్లడించారు.

హుజూర్‌నగర్: విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందించటంలో కొత్త ఉపాధ్యాయులు ముందు వరసలో ఉండాలని మండల విద్యాధికారి సైదానాయక్ అన్నారు. కొత్తగా ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు బుధవారం మండల విద్యాధికారి కార్యాలయంలో రిపోర్టు చేశారు. అనంతరం విధుల్లో చేరారు.

పాలకవీడు గ్రామీణం: పలు పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులు 23 మంది విధుల్లోకి చేరినట్లు ఎంఈవో కాటయ్య తెలిపారు.

చిలుకూరు: ఉపాధ్యాయ ఉద్యోగాలలో బధిరులకు సంబంధించిన విభాగంలో మండల కేంద్రానికి చెందిన బాలేబోయిన నరేష్ ఎంపికైనట్లు ఆయన బుధవారం విలేకరులకు తెలిపారు. జిల్లా విద్యాధికారి అశోక్ చేతుల మీదుగా చింతలపాలెం మండల కేంద్రంలోని పాఠశాలలో చేరేందుకుగాను నియామకపత్రాన్ని అందుకున్నట్లు చెప్పారు.

చిలుకూరు: ఉపాధ్యాయులు వృత్తికి వన్నె తెచ్చేలా పని చేసి, గుర్తింపు తెచ్చుకోవాలని ఇన్‌ఛార్జి ఎంఈవో గురవయ్య అన్నారు. చిలుకూరు ఎంఈవో కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు.

నడిగూడెం: ఐదుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఈవో బి.ఉపేందర్‌రావు తెలిపారు. ఎంపీపీఎస్ రామాపురంలో సాయి రాజ్, ఎంపీపీఎస్ ఇకేపేట ఉపేందర్, ఎంపీపీఎస్ కరివిరాల నాగార్జున, ఎంపీపీఎస్ నడిగూడెం అమూల్య, జడ్పీహెచ్ఎస్ నడిగూడెంలో కల్పన సాంఘికశాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరినట్లు చెప్పారు.

ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. ఏపీకి చెందిన పాలకీర్తి రమణ అనే మహిళ ప్రజల నుంచి రేషన్ బియ్యం సేకరించి నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో తనిఖీ చేసి బియ్యం పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఆహారాన్ని వృథా చేయొద్దు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆహారాన్ని వృథా చేయొద్దని ఎంఈవో సలీంషరీఫ్ అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సరైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు మార్కండేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'దళితులపై దాడి హేయమైన చర్య'

చిలుకూరు: బేతవోలులో దళితులపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు స్కైలాబ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్ తెలిపారు. గ్రామంలోని బాధిత కుటుంబ సభ్యులను బుధవారం వారు పరామర్శించారు. దళితులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పండగ రోజు దళిత యువకుడు వీడియో కాల్ మాట్లాడుతుంటే దానిని అపార్థం చేసుకొని వారిపై దాడి చేయడం హేయమైన చర్య అని, పోలీసులు విచారణ చేయకుండా రాత్రికి రాత్రే కేసులు చేసి జైలుకు పంపడం సరైంది కాదన్నారు. నాయకులు కోట గోపి, నాగేశ్వరరావు, సురేష్, శ్రీనివాస్, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదును విస్మరించొద్దు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఓటు నమోదులో నిర్లక్ష్యం తగదని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఉస్తెల సైదిరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఓటు నమోదుకు సంబంధించిన ఫామ్-19ను మేళ్లచెరువు, రామాపురం, రేవూరు ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బుధవారం అందజేసి మాట్లాడారు. అందరూ తప్పకుండా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, శ్రీను, శైలజ, తదితరులు పాల్గొన్నారు.



రామాపురంలో ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు నమోదు ఫామ్‌ను అందజేస్తున్న యూనియన్ నాయకులు


సొంత ఖర్చులతో పాఠశాల మైదానం అభివృద్ధి

మఠంపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో వర్షపు నీరు నిలిచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు మఠంపల్లికి చెందిన ఆదూరి కిషోర్ ముందుకు వచ్చారు. సుమారు రూ.10 వేలతో వర్షపు నీరు క్రీడా ప్రాంగణంలో నిల్వ ఉండకుండా సిమెంట్ గూనలు ఏర్పాటు చేయించి మొరం మట్టిని పోయించారు. ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ఎస్కే మౌలానా, ఉపాధ్యాయులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా రైస్ మిల్లు డ్రైవర్ల వేతన, అలవెన్సులు పెంచాలని మిల్లుల యజమానులను టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. పట్టణంలో రైస్ మిల్లుల పరిశ్రమ ప్రాంతంలో వీరబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్ మిల్లు డ్రైవర్ల రెండు సంవత్సరాల వేతన, అలవెన్స్‌ల అంగీకారం ఈ నెల 31తో పూర్తి అవుతుందని, తిరిగి ఒప్పందం చేసుకునేందుకు గతంలో ఉన్న వేతనంపై రూ.మూడు వేలు అదనంగా పెంచాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు. మిగతా కార్మిక సంఘాలతో చర్చించి, ఐక్యంగా పోరాడాలని తీర్మానం చేశారని తెలిపారు.

గాలితో కూడిన వర్షం.. నేలకొరిగిన వరి



ఇటీవల వచ్చిన గాలివానలతో వెన్నుదశలో ఉన్న వరి పంట నేలకొరగడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. గతంలో వరదలకు నష్టపోయి ఉన్న రైతన్నకు మళ్లీ తీవ్ర నష్టం వాటిల్లింది. వరిపంట నేలపై పడటంతో గింజ సరిగా పోసుకోకుండా, మడిలోని నీటిలో పడి కుళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేలపై పడిన వరిని కూలీలతో కట్టించడానికి ఎకరానికి రూ.5 వేల వరకు ఖర్చవుతుందని తెలిపారు. దిగుబడి కూడా తక్కువగా వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా వంద ఎకరాల్లో వరి పంట నేలకొరిగినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. —మునగాల, న్యూస్‌టుడే:

క్రీడలతో స్నేహభావం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, భారాస పట్టణ అధ్యక్షుడు షేక్.నయీమ్ అన్నారు. మహేంద్ర యూత్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో కోదాడ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం రాత్రి బహుమతులు అందించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి, నయీమ్

అవీ ఇవీ

విజయవంతం చేయండి.. కోదాడ పట్టణం: హైదరాబాద్‌లోని సుందరయ్య కళాభవన్‌లో 18న జరిగే కల్లుగీత కార్మిక సంఘ 67వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. కోదాడలో వార్షికోత్సవానికి సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ, తదితరులున్నారు.

అవగాహన.. నడిగూడెం: మత్తు పదార్థాల నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలని, డ్రగ్స్, గంజాయికి అలవాటుపడి జీవితాలను బలి చేసుకోవద్దని ఎస్సై బి.అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం త్రిపురవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఎన్నిక.. కోదాడ పట్టణం: మీ సేవా ఆపరేటర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కోదాడ పట్టణానికి చెందిన మీ సేవ నిర్వాహకుడు కొదుమూరి ప్రవీణ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఆ సంఘ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి.. నడిగూడెం: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత గాలి కుంటువ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి అఖిల కోరారు. బుధవారం నడిగూడెంలో ఉచిత శిబిరాన్ని ప్రారంభించి 544 పశువులకు టీకాలు వేశారు.

డిమాండ్.. పాలకవీడు గ్రామీణం: ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయటానికి గ్రామాల్లో ఏర్పాటుచేసిన కమిటీలు కాంగ్రెస్ పార్టీ కమిటీలుగా మారాయని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాశ్ విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ గ్రామాల్లో అఖిలపక్ష కమిటీలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

వరద నష్ట పరిహారం జమ.. పాలకవీడు గ్రామీణం: అన్నదాతలకు ఎల్లవేళలా అండగా ఉండటమే కాంగ్రెస్ పార్టీ ఎజెండా అని మాజీ ఎంపీపీ గోపాల్ తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. మండల పరిధిలో 201.34 ఎకరాలకు నష్టం జరగగా 264 మంది రైతులకు త్వరితగతిన పంట నష్ట పరిహారం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు.

పూజలు.. అనంతగిరి: మండల కేంద్రంలోని శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి సన్నిధిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ వాసు తెలిపారు. అనంతరం దాత బాణోతు బాలు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీరయ్య, లింగయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం... హుజూర్‌నగర్ గ్రామీణం: శ్రీనివాసపురం గ్రామానికి చెందిన అరిబండి శ్రీను అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసిన ఉత్తమ్ యువసేన నాయకులు రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజు, పీఏసీఎస్ ఛైర్మన్ గోపాలరావు, సుబ్బారావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, విశ్వం, మా నాన్న సూపర్‌హీరో, వేట్టయన్, జనక అయితే గనక, శ్రీనివాస: దేవర, కాన్‌ప్లెక్స్: వేట్టయన్, విశ్వం, మానాన్న సూపర్ హీరో, రంగా: వేట్టయన్, వెంకటేశ్వర: విశ్వం

ఎస్పీకి ఫిర్యాదు

కోదాడ: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలోని సర్వే నం.149లో భూమిని కొందరు కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త పొడుగు హుస్సేన్ బుధవారం జిల్లా ఎస్పీకి ఆన్‌లైన్ విధానంలో ఫిర్యాదు చేశారు. కబ్జాదారులకు ప్రభుత్వ అధికారులు సహకరించారని, వారిపై కేసు నమోదు చేయాలని పట్టణ ఇన్‌స్పెక్టర్‌కు గత నెలలో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమన్నారు.

బాధ్యతల స్వీకరణ

కోదాడ: కోదాడ ఆర్డీవోగా సూర్యనారాయణ ఇతర కారణాల దృష్ట్యా సెలవులపై వెళ్లడంతో హుజూర్‌నగర్ ఆర్డీవో ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. బుధవారం సూర్యనారాయణ మరోసారి పదవీ బాధ్యతలు స్వీకరించారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

గోదాముల పరిశీలన


గోదాములను పరిశీలిస్తున్న సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవరావు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని నంద్యాలగూడెంలో నిర్మించిన 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన రెండు గోదాములను సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవరావు బుధవారం సందర్శించి పరిశీలించారు. ప్రభుత్వం త్వరలో సన్న వడ్లను కొనుగోలు చేయనున్న నేపథ్యంలో ఈ గోదాముల్లో బస్తాలను భద్రపరిచేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోదాముల పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. కాగా గోదాములకు సమీప గ్రామంలో సన్నవడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యవంతంగా ఉంటుందని స్థానిక ఆదర్శ రైతు నంద్యాల కృష్ణారెడ్డి ఆర్డీవోకు విన్నవించారు. స్థానిక డిటీ హరిచంద్రప్రసాద్, ఆర్ఐ అంజయ్య, సివిల్ సప్లయ్, మార్కెటింగ్ సిబ్బంది అశోక్, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘పేదలపై ధరల భారం’


పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయకుండా పేద ప్రజలపై పెనుభారం మోపడం బాధాకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ఆరోపించారు. మండలంలోని దూపహాడ్ గ్రామంలో బుధవారం నిర్వహించిన పార్టీ మండల బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 28 వరకు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున మద్దతు తెలిపి జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 26న పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామంలో ఎనిమిదో మండల మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు ధనియాకుల శ్రీకాంత్, మడ్డి అంజిబాబు, గుంజ వెంకటేశ్వర్లు, ఇరుగు రమేశ్, రాములు, శ్రీకాంత్, వెంకన్న, సుమీల తదితరులు పాల్గొన్నారు.


దూపహాడ్‌లో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు

సమసమాజం కోసం కమ్యూనిస్టులు పోరాడాలి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: పేదల రాజ్యం కోసం కమ్యూనిస్టులు పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. బుధవారం తొండలో ఆ పార్టీ గ్రామశాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వనరులను, జాతి సంపదను ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు మోదీ ప్రభుత్వం కట్టబెడుతుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. పురుగుజ్జ వెంకటయ్య, పోరెల్ల సోమయ్య, మండల కన్వీనర్ గుమ్మడవెల్లి ఉప్పలయయ్య, లింగయ్య, వెంకన్న, బిక్షం, వెంకటయ్య పాల్గొన్నారు.

వృక్షాలే రక్షణని భావించి.. భావితరాల క్షేమం కాంక్షించి



వెంకేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా జువ్విచెట్టు చుట్టూ వెంకట్రావమ్మ కట్టించిన అరుగు

చెట్లే జీవకోటికి ప్రాణవాయువని, తరతరాలుగా ప్రజలకు నీడనిస్తూ, సేదతీరుస్తున్నవి వృక్షాలేనని గ్రహించారు ఈ వృద్ధులు. పడిపోతున్న మొక్కలకు జీవం పోస్తూ సంరక్షిస్తున్నారు. మలిదశలో వారికి చేతనైనంత శ్రమిస్తూ వాటిని కాపాడుకుంటూ వస్తున్నారు ఎనభైయేళ్ల కొప్పుల వెంకట్రావమ్మ, 78 ఏళ్ల నామాల చక్రయ్య. జీవితంలో ఆనందంగా గడపాల్సిన వయస్సులో మొక్కలే ప్రాణంగా సాగుతున్న వీరు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. - నూతనకల్, న్యూస్‌టుడే:

☛ నూతనకల్ మండలంలోని వెంకేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం(సావటి) ఆవరణలో సుమారు రెండు వందల ఏళ్ల నాటి జువ్విచెట్టు రెండు తరాల వారికి నీడనిస్తూ సేదతీర్చింది. 2010లో చెట్టు మొదలు చుట్టూ చదలు పట్టి వాడిపో సాగింది. దీన్ని గమనించిన గ్రామానికి చెందిన కొప్పుల వెంకట్రావమ్మ ఎలాగైనా దాన్ని కాపాడాలని నిర్ణయించుకున్నారు. భర్త కొప్పుల మల్లారెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడిగా పింఛన్ తీసుకుంటూ మరణించారు. ఆయన పింఛన్ ప్రస్తుతం వెంకట్రావమ్మకు వస్తోంది. రూ.30 వేలతో తన భర్త జ్ఞాపకార్థం జువ్విచెట్టు చుట్టూ అరుగు కట్టించి సిమెంట్ కాంక్రీట్ వేయించారు. ఆ చెట్టు ఇప్పుడు చిగురించి మరోతరానికి నీడనిచ్చేలా, దాని నీడలో అరుగుపై గ్రామసభలు, సమావేశాలు, బటసారులకు నెలవుగా మారింది. చెట్టును కాపాడితే ముందు తరం వారికి నీడనిచ్చిన వారిమవుతామని అందుకే ఇది కట్టించానని వెంకట్రావమ్మ ‘న్యూస్‌టుడే’కు వివరించారు.

☛ మండల కేంద్రానికి చెందిన నామాల చక్రయ్య దినసరి కూలీ. ఉపాధి కూలీ పనులకూ వెళ్తుంటారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడమంటే ఎంతో ఇష్టంగా పని చేస్తుంటారు. ఆయన పనిని గ్రహించిన పంచాయతీ కార్యదర్శి శర్మ ఆయన సేవలు ఉపయోగించుకోవాలని ఉపాధిహామీ కింద వాచర్‌గా నియమించారు. రోజూ ఉదయం నర్సరీకి వెళ్లి అక్కడి మొక్కలను, పలుగు, పార, కొడవలి, ప్రత్యేక ముల్లపార, గొడ్డలిని సైకిల్‌కు కట్టుకొని గ్రామానికి నలుమూలలా వాటిని నాటుతున్నారు. యడవెల్లి, లింగంపల్లి, మిర్యాల, చిల్పకుంట్ల రోడ్డువెంట చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటుతూ.. కంచెవేస్తూ, పాదులు తీస్తూ ఏపుగా పెరిగేలా కృషి చేస్తున్నారు. వంద రోజులపాటు సాగే పనుల్లో రోజూ కూలీ రూ.300 తీసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన పట్టుదలను చూసి రోడ్డు వెంట వెళ్లే బాటసారులు ఆయన వివరాలు అడిగి తెలుసుకొని అభినందిస్తున్నారు.


సైకిల్‌కు పనిముట్లు, వెనకాల మొక్కలు కట్టుకొని నాటడానికి వెళ్తున్న చక్రయ్య

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని శ్రీరాంనగర్ కాలనీకి చెత్త బండి రావటం లేదు. ఇళ్లలోంచి చెత్త పేరుకుపోయి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వచ్చేలా చూడాలి. - రేణుక, శ్రీరాంనగర్

✔ వెంటనే పంపిస్తాం. - సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని దాబాల నిర్వాహకులు వ్యర్థాలు ఇష్టారాజ్యంగా వదులుతున్నారు. చుట్టుపక్కల నివాస గృహాల వారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలి. - శంకర్, సూర్యాపేట

✔ నిర్వాహకులతో మాట్లాడి సమస్య లేకుండా చూస్తాం. - శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట.

నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎం.విజయకుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం మండలాల్లో పనిచేసే మల్టీపర్పస్ సిబ్బందికి చేతిపంపుల మరమ్మతులు, నీటి లీకేజీ సమస్యలు, మంచినీటి నాణ్యత పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీవో బీసింగ్, ఏఈ మహేశ్ పాల్గొన్నారు.


చేతిపంపులపై శిక్షణ ఇస్తున్న గ్రామీణ నీటి సరఫరా అధికారులు

కాల్వలు లేక.. మురుగు పారక

తిరుమలగిరి పుర పరిధిలోని శివారుకాలనీల్లో మురుగు కాల్వలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల్లిబండతండా, ఈదులపర్రెతండా, రామునిబండతండా, నందాపురం, అనంతారంలోని జంగాలకాలనీ, సుందరయ్యనగర్ కాలనీల్లో కాల్వలు లేక మురుగునీరు



వీధుల్లో ప్రవహిస్తోంది. తరచూ పడుతున్న వర్షాల కారణంగా వీధుల్లో నడవలేని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధులు సరిగా లేక కారణంగా చెత్తసేకరణ వాహనాలు ప్రధాన రహదారిపైనే తిరిగి వెళ్తున్నాయని వాపోతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి పురపాలిక కమిషనర్ ఎం.బుచ్చిబాబును అడగగా మురుగు కాల్వల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ జరుగుతుందని, పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, తిరుమలగిరి

ఆలస్యంగా ధాన్యం కొనుగోళ్లు


రైతులతో మాట్లాడుతున్న మార్కెట్ కార్యదర్శి బి.శ్రీధర్, తహసీల్దార్ హరిప్రసాద్

తిరుమలగిరి, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ సంచుల కారణంగా తమ చేతులు మండుతున్నాయని గన్నీ సంచుల(జూట్)ల్లో మాత్రమే తూకాలు వేస్తామని హమాలీలు, గన్నీ సంచుల కొరత కారణంగా ప్లాస్టిక్ సంచుల్లో తూకాలు వేయాలని వ్యాపారులు అంటూ.. బుధవారం మధ్యాహ్నం 3గంటల వరకు తిరుమలగిరి మార్కెట్ యార్డులో కొనుగోళ్లు ప్రారంభించలేదు. రైతులు వాతావరణ మార్పుల కారణంగా వర్షం వచ్చే సూచనలు ఉన్నాయని ఆందోళనలతో పలుసార్లు అధికారులను, వ్యాపారులను కొనుగోలు చేయాలని అడిగారు. మార్కెట్ కార్యదర్శి డి.శ్రీధర్ వ్యాపారులతో, హమాలీకార్మికులతో మాట్లాడినా ఏలాంటి మార్పు రాలేదు. దీంతో జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం దాటినా టెండర్లు వేయక పోవడంతో అగ్రహించిన రైతులు సూర్యాపేట-జనగాం రోడ్డుపై భైఠాయించేందుకు ప్రయత్నించారు. అక్కడికి చేరుకున్న తహసీల్దార్ హరిప్రసాద్, ఎస్సై వి.సురేశ్ రైతులకు నచ్చచెప్పి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. అనంతరం చర్చించి మార్కెట్‌కు వచ్చిన 12వేల బస్తాల ధాన్యాన్ని.. 8వేల బస్తాలను గన్నీసంచులలో, 4వేల బస్తాలు ప్లాస్టిక్ బస్తాలలో తూకం వేయాలని నిర్ణయించడంతో అప్పుడు టెండర్ల ప్రక్రియ ప్రారంభించారు. అనంతరం కొనుగోళ్లు జరిపి తూకాలు వేశారు.

☛ మార్కెట్‌లో ఆలస్యంగా కొనుగోళ్లు ప్రారంభమయినందున, తుకాలు వేసి ఎగుమతులు చేయడం ఇబ్బందిగా ఉన్నందున గురువారం మార్కెట్‌యార్డుకు సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్‌కార్యదర్శి దేశబోయిన శ్రీధర్ తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితం పాడుచేసుకోవద్దు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: గంజాయి, మత్తుపదార్థాలు సేవిస్తూ జీవితాలను పాడు చేసుకోవద్దని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఎస్పీ ఆదేశాల మేరకు పుర పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలో పోలీసు కళాబృందంతో అవగాహన కల్పించారు. స్థానిక ఎస్సై వి.సురేశ్, ఏఎస్సై నికోలస్, పోలీస్‌సిబ్బంది హరిబాబు, కళాబృందం సభ్యులు ఎల్లయ్య,గోపయ్య, గురులింగం, క్రిష్ణాచారి పాల్గొన్నారు.

మద్దిరాల: యువత మత్తుపదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ అన్నారు. ఎస్సై ఎం.వీరన్న ఆదేశాల మేరకు మండల కేంద్రంలో బుధవారం మత్తు పదార్థాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. కానిస్టేబుల్ చందు, తదితరులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం: తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నిషేధం, గంజాయిపై పోలీసులు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అర్వపల్లి ఎస్సై బాలకృష్ణ విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తిరుమలగిరిలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి

అవమానం భరించలేక వ్యక్తి ఆత్మహత్య



తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అవమానం భరించలేక ఓ వ్యక్తి లేఖ రాసి బలవన్మరణానికి పాల్పడిన ఘటన తూర్పుగూడెంలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన **తాడూరి కృష్ణయ్య(36)**కు గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉందని.. లేనిపోని ఆరోపణలతో గ్రామానికి చెందిన కొందరు పెద్ద మనుషులు కావాలనే సదరు మహిళతో తనపై కేసు పెట్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని.. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మృతుడు సుసైడ్ లేఖలో వారి పేర్లు రాసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం కృష్ణయ్య తన పొలం వద్ద పురుగు మందు తాగగా.. స్థానికులు వెంటనే సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. భార్య తాడూరి అనిత ఫిర్యాదు మేరకు లేఖలో పేర్కొన్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఏడుకొండలు తెలిపారు.

పాత కక్షలతో దాడి: 15 మందిపై కేసు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: పాత కక్షలతో దాడి చేసిన ఘటనలో 15మందిపై కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ శంకర్‌నాయక్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాతర్లపహాడ్ ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 15మంది అదే గ్రామ వాసి జటంగి గంగయ్య ఇంటిపై సోమవారం దాడిచేసి చేతులతో తీవ్రంగా కొట్టారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందుతులైన ఆరెంపుల సైదులు, నవీన్, మహేష్, పేతురు, ముఖేష్, విష్ణు, సన్ని మరికొందరిపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పాఠశాలకు ఆట సామగ్రి అందజేత

మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన వరిపెల్లి సోమేష్ రూ.1.20 లక్షల విలువైన ఆట వస్తువులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనను అభినందించారు. ఉపాధ్యాయులు కోటేశ్వర్, విజయలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.


గుమ్మడవెల్లిలో ఆట వస్తువులతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించాలని రేఖా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ బోయలపల్లి రేఖ అన్నారు. అర్వపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం అధ్యక్షుడు వేల్పుల రమేష్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ, ట్రస్ట్ డైరెక్టర్ మడ్డి పద్మ, ఉపాధ్యాయులున్నారు.

కొత్తగా.. గురువులొచ్చెనా..


తిరుమలగిరిలో కొత్తగా ఉపాధ్యాయులకు పాఠశాలలో చేరే పత్రాలు అందజేస్తున్న ఎంఈవో ఐ.శాంతయ్య

తిరుమలగిరి: అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని మండల విద్యాధికారి ఐ.శాంతయ్య పేర్కొన్నారు. డీఎస్సీ-2024లో ఉపాధ్యాయులుగా ఎంపికై మండలానికి వచ్చిన 25 మంది ఎస్జీటీ, ఏడుగురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు బుధవారం మండల వనరుల కేంద్రంలో పాఠశాలలో చేరేందుకు అనుమతి పత్రాలు అందజేశారు.

నూతనకల్: చిల్పకుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో జటంగి సౌనయ్య, తాళ్లసింగారం ప్రాథమిక పాఠశాలలో తోట రాంబాబు మరోకరు గోసుల వెంకన్న వచ్చి చేరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్ది శ్రీనివాస్‌రావు, సోమయ్యలు నూతన ఉపాధ్యాయుల నుంచి నియామకపత్రాలు స్వీకరించి విధుల్లో చేర్చుకున్నారు.

నూతనకల్ గ్రామీణం: ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు బుధవారం మండలంలోని ఆయా పాఠశాలలో విధుల్లో చేరినట్లు ఎంఈవో రాములు నాయక్ తెలిపారు.

మండల విద్యాధికారి కార్యాలయంలో నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. 1 పీడీ, ఇద్దరు తెలుగు పండిట్‌లు, 8 మంది ఎస్జీటీలు చేరినట్లు ఆయన పేర్కొన్నారు.

మద్దిరాల గ్రామీణం: మండల పరిధిలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల కుంటపల్లి-2, కుక్కడం-01, గుమ్మడవెల్లి-01, రెడ్డిగూడెం-01 నూతనంగా ఎంపికైన ఎస్జీటీ ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. ఆయా గ్రామాల విద్యావంతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తుంగతుర్తి: మండలంలో 28 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు మండల విద్యాధికారి బోయిని లింగయ్య తెలిపారు. బుధవారం తమ కార్యాలయంలో రిపోర్టు చేసి అనంతరం పాఠశాలలకు వెళ్లి విధుల్లో చేరారన్నారు.

మద్దిరాల, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో విధులు నిర్వహించి గుర్తింపు తెచ్చుకోవాలని మండల విద్యాధికారి తండు వెంకటనారాయణ, ఎంపీడీవో మారుతి సత్యనారాయణరెడ్డి సూచించారు. ఇటీవల ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి కార్యాలయంలో బుధవారం నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. మండలంలో నూతనంగా 9 మంది ఉపాధ్యాయులు వచ్చారని, అందులో ఏడుగురు విధుల్లో చేరారని తెలిపారు. సీఆర్పీలు కాటి శ్రీను, నవీన్, ఉపాధ్యాయులు రేపాక లింగయ్య, జిబిలికపెల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: ఎనిమిది మంది ఎస్జీటీలు, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం నియామక ఉత్తర్వులు అందజేయగా విధుల్లో చేరారని ఎంఈవో నకిరెకంటి రవి తెలిపారు.

ఆత్మకూర్(ఎస్): ఎనిమిది మంది నూతన ఉపాధ్యాయులకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో పి.ధారాసింగ్ నియామక పత్రాలు అందించారు.

తండ్రిబాటలో తనయ..



తిరుమలగిరి, న్యూస్‌టుడే: తిరుమలగిరికి చెందిన చిల్లం శెట్టి రవీందర్ స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం)గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కూతురు చిల్లంశెట్టి సృజన డీఎస్సీ-2024లో స్కూల్‌అసిస్టెంట్(ఆంగ్లం) ఉపాధ్యాయురాలుగా ఎంపికైంది. యాదృచ్ఛికంగా ఇదే మండలంలోని గుండెపురి జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎంపికైంది. గురువారం తండ్రితో కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పోలా పద్మావతికి తన చేరిక పత్రాన్ని అందజేశారు. తండ్రి బాటలో కూతురు కూడా ఆంగ్ల ఉపాధ్యాయులుగా ఎంపికవడం ద్వారా తండ్రి కూతుళ్లను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

చరవాణి అప్పగింత.. నాగారం: నాగారం(బంగ్లా) గ్రామానికి చెందిన గుంటకండ్ల ముకుందారెడ్డి గతేడాది నవంబర్ 24న రూ.13 వేల చరవాణిని పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు వెతికి పట్టి బుధవారం బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా బాధితుడు ఎస్సై ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక.. నాగారం: మండలంలోని వర్ధమానుకోటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి ఎమ్మెల్యే మందుల సామేల్ గురువారం రానున్నారని ఏపీఎం శోభారాణి తెలిపారు.

జాజిరెడ్డిగూడెం: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి ఎమ్మెల్యే మందుల సామేల్ రానున్నారని ఏపీఎం మల్లేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నూతనకల్ ఏపీఎంగా రమణాకర్.. నూతనకల్: జిల్లా సెర్ప్ కార్యాలయంలో ప్రత్యేక విధులు నిర్వహిస్తున్న రమణాకర్ నూతనకల్ ఏపీఎంగా బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న కరుణాకర్ కోదాడకు బదిలీపై వెళ్లారు. రమణాకర్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. సీసీలు సరస్వతి, ముత్తయ్య, బండపల్లి గీత, యశోద, బద్దం ఉదయ్‌కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీ ఎంపిక.. నాగారం: పేదలకు ఇళ్ల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో భాగంగా బుధవారం నాగారంలో కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఛైర్మన్‌గా ఎంపీడీవో ధార శ్రీనివాస్, సభ్యులుగా జాజుల వీరయ్య, అనంతుల వెంకటయ్య, భైరబోయిన మహేశ్, లక్ష్మమ్మ ఎంపికయ్యారు.

మూడోసారి ఎన్నిక.. ఆత్మకూర్(ఎస్): సీపీఎం ఆత్మకూర్(ఎస్) మండల కార్యదర్శిగా ఏపూర్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు అవిరె అప్పయ్య మూడోసారి ఎన్నికయ్యారు. ఇదే మండలం నెమ్మికల్‌లో ఈనెల 15న నిర్వహించిన 8వ మండల మహాసభలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ.. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో).

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3089	1499
జైశ్రీరాం	3139	2329
ఐఆర్-64	1982	1806
హెచ్‌ఎంటీ	2809	1609
కందులు	8087	4389
పెసర	6339	2228
వేరుసెనగ	6029	4209
బొబ్బర్లు	2808	2808
జొన్నలు	3309	3309
మినుములు	6513	6513

ఉచిత గాలికుంటు టీకాలు ప్రారంభం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని కందగట్లలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు బుధవారం ఉచిత సామూహిక గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి వేణుగోపాలరావు ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ఆవులు, దూడలు, గేదెలకు టీకాలు వేశారు. మూడు బృందాలతో మండల వ్యాప్తంగా నవంబరు14 వరకు నెలరోజులపాటు కొనసాగుతుందని తెలిపారు.

అవినీతి అధికారుల సస్పెన్షన్

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మాచనపల్లిలో కల్యాణలక్ష్మి పథకానికి అనర్హత కలిగిఉండి లబ్ధి పొందిన విషయంలో ‘ఈనాడు’లో ఈనెల 6న ‘కల్యాణలక్ష్మికి అవినీతి మకిలి’ శీర్షికన వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. ఆర్డీవో విచారణ అనంతరం తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన ఇద్దరు కార్యదర్శులు వెంకటరెడ్డి, అనిల్‌తోపాటు, నివేదిక సమర్పణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అదనపు గిర్దవారు లక్ష్మీప్రసాద్‌ను బుధవారం జిల్లా పాలనాధికారి సస్పెండ్ చేసినట్లు తహసీల్దారు శ్రీనివాస్ రావు తెలిపారు. తప్పుడు పత్రాలతో లబ్ధిపొందిన మాచనపల్లికి చెందిన 11 మందిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై మహేంద్రనాథ్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

గురుకుల భవన యజమానిపై కేసు నమోదు


తుంగతుర్తి, న్యూస్‌టుడే: తుంగతుర్తిలోని మైనార్టీ గురుకుల పాఠశాల భవన యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏడుకొండలు తెలిపారు. మంగళవారం పాఠశాల పునప్రారంభం రోజున సిబ్బందిని లోనికి రానివ్వకుండా గేటు తాళం వేసి వారి నిర్వహణకు ఆటంకం కల్గించారని, ఈ విషయమై ప్రిన్సిపల్ ఉమ ఫిర్యాదు మేరకు భవన యజమాని బత్తుల లాలయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహనీయుల విగ్రహాలకు పుష్పాభిషేకం

తిరుమలగిరి, న్యూస్‌టుడే: సమగ్ర కులగణన ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించినందున బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఆ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పులే విగ్రహాలకు పుష్పాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు హాజరై మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య, కౌన్సిలర్ హన్మంతు, బ్రహ్మం, సోమరాజు, సోమేశ్, శ్యాం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


మహాత్మా జ్యోతిబా ఫులే విగ్రహానికి పుష్పాభిషేకం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు ←

అదృశ్యం కేసు నమోదు



చివ్వెంల, న్యూస్‌టుడే: ఉండ్రుగొండ గ్రామానికి చెందిన **అంబటి పెద యల్లయ్య(45)** గత పది రోజుల క్రితం నుంచి కనిపించడం లేదు. తమ కుమారుడు ఈనెల 6న ఇంట్లోంచి వెళ్లిపోగా.. చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని అతని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.వెంకట్‌రెడ్డి తెలిపారు. విచారణ నిమిత్తం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ప్రజాపంపిణీ బియ్యం పట్టివేత

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న ప్రజాపంపిణీ బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తుంగతుర్తి సీఐ శ్రీనువాస్ నాయక్, ఎస్సై మహేంద్రనాథ్ తెలిపారు. మండల పరిధిలోని ఎర్రపహాడ్ సమీపంలో 365 జాతీయ రహదారిపై సాధారణ తనిఖీలు చేస్తుండగా బొలేరో వాహనంలో అక్రమంగా 30 కింటాళ్ల ప్రజాపంపిణీ బియ్యాన్ని పట్టుకొని డ్రైవర్ పొన్నం మురళిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మద్దిరాల మండలం నుంచి ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్‌లోని రైస్ మిల్లుకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని అక్రమ బియ్యం సరఫరా చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్పీ పోలీస్ తండు రవీందర్‌గౌడ్, మల్లయ్యలను సీఐ అభినందించారు.